# సిగ్గు లేదు

పొలదుగు వెంకటేశ్వర రావు



మళ్ళీ - కిష్టిగాడూ, సూరిబాబూ ఆటల్లో దెబ్బలాడుకున్నారు. సూరిబాబు కిష్టిగాడి నెత్తిమీద ఇంత దుమ్ము పోసి, రక్కి పైగా పెద్ద గొంతులో ఏడ్చాడు. అది రుక్మిణి చూసింది. చూసి కోపం ఆపుకోలేకపోయింది.

కిష్టిగాడ్ని దగ్గరకి పిల్చి కసిదీరా తొడపాశం పెట్టింది. వంగదీసి జుట్టు పట్టుకుని వీపు మీద వాడ్ని గుద్దింది 'వెధవా! ఈ సారి వాడి జోలికి పోతావా?'' అంటూ వాడికి తగినశాస్తి చేసింది. కిష్టిగాడు అన్నీ మౌనంగా భరించేడు. కాని అదంతా యశోదమ్మా చూసింది. యశోదమ్మ ఏమీ అనలేదుగాని రుక్మిణే ఉడుక్కుంది. ఎన్నిసార్లు చెప్పినా అంతే. మళ్ళీ మొదటికే వస్తారు. 'ఒద్దురా' అంటె వినరు దెబ్బలాడు కుంటారు. మరల అంతలోనే కల్సిపోయి ఆటల్లో పడతారు సిగ్గులేదు.

సూరిబాబు రుక్మిణి కొడుకు. రుక్మిణి యశోదమ్మ పెద్ద కూతురు. రుక్మిణి భర్త రామమూర్తికి బందర్లో గుమాస్తా ఉద్యోగం. రుక్మిణి చెల్లెలు రాధ. రాధని స్కూలు మేష్టరుకి ఇచ్చారు. అతను ఈ మధ్యనె గుండెజబ్బు వచ్చి చనిపోయాడు. అందువలన నేనే దిక్కులేని రాధ తల్లిదండ్రుల పంచన చేరింది. కిష్టిగాడి అసలుపేరు కృష్ణబాబు. వాడి బాబు బతికున్న రోజుల్లో కృష్ణబాబూ దర్జాగానె పెరిగాడు. కాని తండ్రి పోయాక, మతి చెడిన తల్లి పరుల పంచన చేరాక కృష్ణబాబు కిష్టిగాడయ్యాడు.

యశోదమ్మ భర్త బ్రహ్మయ్య గుమాస్తాగా ఉద్యోగంచేసి రిటయిరయ్యాడు. తన్నంతలో బాగానే పెట్టి కూతుళ్ళిద్దరి పెళ్ళిళ్ళూ చేసేడు. ముద్దు ముచ్చట్లు తీర్చేడు. తలరాత సరిగ్గాలేక ఒక కూతురు తన పంచన చేరింది. కృష్ణారామా అనుకోవాల్సిన రోజుల్లో సంసార భారం భుజాలమీద పడింది. అందువలన బ్రహ్మయ్య తప్పక ఈ వయస్సులో ఏదో కొట్లో పద్దులు రాసి నాల్గు రాళ్ళు తేవాల్సిన అవసరం ఏర్పడింది.

పండక్కి రమ్మని రుక్మిణికి ఆమె భర్తకీ ఉత్తరం రాసేడు బ్రహ్మయ్య. రామ్మూర్తి రాలేదు. గాని రుక్మిణి వచ్చింది. రుక్మిణికి రావాలనె వుంటుంది. అదని ఇదని పుట్టింటి నుంచి ఏదో పట్టుకుపోవాలని వుంటుంది. కాని ఈ మధ్యన పుట్టింటికి రావటానికి రుక్మిణికి చిరాగ్గా వుంటుంది. అందుకు కారణం రాధ. రాధకి పిచ్చివాలకం వచ్చింది. ఏమీ పట్టించుకోదు రాధని తన చెల్లెలు అని చెప్పుకోటానికి రుక్మిణికి అసహ్యం

కిష్టిగాడికి బ్రహ్మయ్య దగ్గర చేరిక. రోజూ ఆయన వాడికి రాత్రిపూట కాసేపు చదువు చెప్తాడు. తొడమీద కూర్చో పెట్టుకుని కబుర్లాడతాడు. అది చూడలేదు రుక్మిణి. తన బిడ్డ దొరబాబు లాగ వుంటాడు. వాడ్ని వదిలిపెట్టి ముసలాయన ఆ దిక్కులేని వాడ్ని చేరదియ్యటం రుక్మిణి సహించలేక పోతుంది.

'పండక్కి రుక్మిణికి, సూరిబాబుకి బట్టలు తెచ్చాడు బ్రహ్మయ్య. నాకూ కావాలని గొడవచేశాడు కిష్టిగాడు. ఎంత చెప్పినా వినలేదు. ఆ పూట అన్నం తినక మంకుపట్టు పట్టాడు. అంతకంటె అప్పు దొరకనందువలన వాడికి బట్టలు తేలేక పోయేడు బ్రహ్మయ్య. చివరికి కిష్టిగాడి వీపు పేలింది.

'వెధవకి మంచి శాస్తి జరిగింది' అని సంతోషించింది రుక్మిణి. 'లేపోతే నా బిడ్డతో వాడికి పంతా?' అనుకుంది. ప్రతి దానికీ పోటీ. సిగ్గులేదు. తన బిడ్డ తండ్రి ఉద్యోగి. పరువు ప్రతిష్ఠలు కలవాడు. అంతస్తు వున్నవాడు. అటువంటి తన బిడ్డలో వీడికి పోటీ ఏమిటి? మరి అని నవ్వుకుంది.

ఈ ముసలాళ్ళా అంతే. యశోదమ్మకి రాధంటేనె ఎక్కువ ఇష్టం. పక్షపాతం. రాధని తల్చుకుని చాటు మాటున కన్నీరు పెట్టుకుంటుంది. అందుకె రాధ గతి అలాగ అయిందని కసిగా అనుకుంటుంది రుక్మిణి. ముసలాయనకి కిష్టిగాడంటె ఎంతో ఇది. ఆ ఇదిని చూస్తే చిరాకుపడుతుంది రుక్మిణి.

కోపగిస్తుంది: అకారణ మనిపించిన ఆ కోపాన్ని చూసి తెల్లపోతారు వాళ్ళు. అంతే గాని వాళ్ళు మారరు. అందుకే రుక్మిణి పుట్టింటికి రావటానికి గునుస్తుంది. చివరికి తప్పదనుకుని రాక మానదు. వచ్చి ఏదో గొడవ పెట్టుకోక మానదు. ఎంతయినా పుట్టిల్లు. పైగా రావటం మానేస్తే అందవలసిన కానుకలు అందకుండా పోతాయి.

ప్రొద్దుట కిష్టిగాడు అన్నం దగ్గర పేచీ పెట్టాడు. రుక్మిణే సూరిబాబుకీ, కిష్టిగాడికీ వడ్డించింది యశోదమ్మ పప్పు రుబ్బుతూ వుండింది గిన్నెలో కొద్దిగానె నెయ్యి వుండింది. దాన్ని సూరిబాబు కోసమని రుక్మిణే దాచింది. అందులోదె సూరిబాబుకి వడ్డించింది. తనకూ వడ్డిస్తుందను కున్నాడు కిష్టిగాడు. కాని వెంటనె నేతిగిన్నె తీసికెళ్ళి దాచింది రుక్మిణి.

'నాకూ నెయ్యి కావాలి' అన్నాడు కిష్టిగాడు.

'ఎక్కడుంది? అయిపోయింది' అంది రుక్మిణి.

'ఇప్పుడేగామ్మా సూరికివేసావు?' అంటూ పేచీ పెట్టాడు కిష్టిగాడు.

'అయిపోయిందంటె వినవేరా వెధవా ?!' అంటూ కసిరింది రుక్మిణి. నిజానికి ఆ గిన్నెలో ఇంకా నెయ్యి వుంది. అది సూరిబాబుకోసమనే రుక్మిణి దాచింది. తనకీ కావాలంటాడు వెధవ!

'పోన్లే, వాడికూడా వెయ్యమ్మా' అన్నాడు సూరిబాబు. అంతా యశోదమ్మ కూడ వింటూనే వుంది. 'మంచు వెధవ. అడుగున ఏమయినా వుందేమొ చూసి అడికూడ కాస్త విదల్చవే' అంది యశోదమ్మ. యశోదమ్మకి అంతా తెల్సు. తెల్సి కూడ ఇలాగ అంటువుంటుంది—'తన'కి వాడంటే పక్షపాతం. అందుకే రుక్మిణికి కోపం. ప్రేలెడు వెధవ లేడు ప్రతిదానికి పోటీ. వాడంటె రుక్మిణికి అసహ్యం. నివరెంత చెప్పినా లేదు లేదనేసింది కాని వాడికి నెయ్యి వెయ్యనేలేదు. వాడు మధ్యలో అన్నం వదిలి లేచిపోయేడు. బ్రహ్మయ్య వచ్చాక పండగ పూట అన్నం మానేసినందుకు గుద్దులు తిన్నాడు. అయినా వెధవకి సిగ్గు లేదు. 'తాత తాత' అంటు ముసలాయన వెనక తిరిగాడు. మరల వాడ్ని చంకనెక్కించుకోటాన్కి ఈ ముసలాయనకీ సిగ్గు లేదు!

కనుకనె రుక్మిణికి కోపం.

రుక్మిణికి — ఈ మనుషులూ వాళ్ళ తీరులూ చిత్రంగా అన్పిస్తాయి. సహించరానివిగా కన్పిస్తాయి. కినిసి ఎవరెంత చెప్పినా వినకుండా పండగెళ్ళిన మర్నాడె ప్రయాణం కట్టింది రుక్మిణి. యశోదమ్మా, బ్రహ్మయ్యా మరి నాల్గు రోజులుండిపొమ్మని ప్రతిమాలారు. అయినా రుక్మిణి వినలేదు.

రిక్షా పిలిపించి ఎక్కికూర్చుంది మొండిగా.

ఈ సూరిబాబుకి కూడ సిగ్గు లేదు. ఆ కిష్టిగాడిచ్చిన పాతబొమ్మ పుచ్చుకుని వచ్చాడు. వదల్లేక వదల్లేక వాడ్ని విడిచిపెట్టాడు. ఏముందనో!? బ్రహ్మయ్య,



నీ "కథ" "కంచి"కివెళ్ళిందంటే అలా ఏడుస్తావేంటయ్యా !!

మా ప్రింటింగ్ ప్రెస్ కంచిలో వుంది అందుకని పంపాం......

యశోదమ్మ సాగనంపటాన్కి వీధిలో నిలబడ్డారు. వాళ్ళ మధ్యన కిష్టిగాడు గుమ్మాన్నానుకుని పిచ్చి రాధ. పాపం పిచ్చిది. ఏదీ లేదు.

అంతలో — రాక్షసిలాగ ఆ వీధిలోకి దూసుకుంటు వచ్చింది, ఓ లారీ. చూస్తూ వుండగానె దానికి ఎదురుగ పరుగెత్తిన ఓ తాగుబోతు దానికింద పడి చచ్చిపోయాడు. 'అరె! అరె!' అంటు జనం మూగారు. రక్తం వరదలయింది.

రుక్మిణి గుండెలు జలదరించాయి. సూరిబాబుని గట్టిగా గుండెలకి అదుముకుంది. అప్రయత్నంగానె కన్నీరు పొంగి వచ్చింది. ఇంటిగుట్టు లంకకి చేటన్నారు. తన గుండెల్లోనె దాగివుంది ఆ దావానలం. అది పొంగి గుండెల్ని కాల్చింది.

తన భర్త రామ్మూర్తి తాగుతాడు. తాగి రోడ్డుమీద పడిపోతాడు. ఇంటికి వచ్చి అల్లరి చేసి రుక్మిణిని చావబాదుతాడు. అంతా గుండెల్లోనె కుక్కుకుంటుంది రుక్మిణి. ఆ దృశ్యం చూసి రుక్మిణికి రామ్మూర్తి జ్ఞాపకం వచ్చాడు. దుఃఖం పొంగివచ్చింది. ఏడ్చి కళ్ళు వత్తుకుంది. అదిచూసి అప్రయత్నంగానె యశోదమ్మ ఏడ్చింది. బ్రహ్మయ్య ముక్కు చీదుకున్నాడు. వాళ్ళని చూసి కిష్టిగాడూ ఏడ్చాడు. అందర్నీ చూసి సూరిబాబు తెల్లమొహంవేసాడు ఏమీలవంది ఒక్క రాధకే.

చూస్తు వుండగానె కళ్ళెదుటే ఇంత ఘోరం జరిగింది! ఒకవేళ తనరాతా తగలబడి రామ్మూర్తికీ ఇలాగ అయితే తన గతేమిటి!? అమ్మో! అనుకుని రుక్మిణి ఏడ్చింది. రుక్మిణి ఎందుకేడుస్తున్నదో తెలీకపోయినా, మరెందుకో అనుకుని మిగతా వాళ్ళు కూడ ఏడ్చేరు. ఏడ్చి కాసేపటికి కళ్ళు తుడ్చుకున్నారు.

'మనిషికి సిగ్గు లేదు, బాధ్యత లేదు' అనుకుని మొహం తుడుచుకుంది రుక్మిణి. అలాగ ఏడ్చినందుకు తనమీద తనకే కోపం వచ్చింది. ఆ ఏడ్చిన మిగిలిన వాళ్ళమీదా కోపపడింది లోలోపల. కిష్టిగాడు కూడా ఏడ్చాడు. వెధవ !

'ఛీ! ఛీ! సిగ్గు లేదు' అనుకుంది.

ఆ క్షణాన ఆ మాటని తనకి అన్వయించుకోవటాన్కి అంగీకరించింది. పోలీసులు వచ్చారు. జనం చెల్లాచెదరయ్యారు. రిక్షావాడు వచ్చాడు తిరిగి అక్కడి నుంచి. శవాన్ని తరలిస్తున్నారు. రిక్షా సాగిపోయింది మెల్లగా.

యశోదమ్మ, బ్రహ్మయ్య, కిష్టిగాడు చేతులు వూపారు. అవన్నీ సూరిబాబె అందుకున్నాడు. రుక్మిణి మనసు రామ్మూర్తి దగ్గరకి వెళ్లటాన వాళ్ళెవర్నీ ఆమె గమనించలేదు.

'ఈ మనిషికి ఇక సిగ్గూ శరమూ ఎప్పుడు వచ్చేట్టు?' అంటు దిగులుగా గొణుక్కుంటూ వుంది రుక్మిణి. డాబులో, దర్పంతో, అహంతో పుట్టింట గడిపిన ఈ కాస్త కాలాన్ని మరచి అయోమయంగా దీనంగా గడపవలసిన స్వంత కాపురాన్కి తిరిగి సిద్ధమవుతోంది రుక్మిణి. ఉన్నట్టుండి రుక్మిణికి అన్పించింది తనని తాను పునర్విమర్శ చేసుకున్నపుడల్లా స్పష్టంగా తనకే తెలుస్తుంది. వాళ్లని వీళ్లని అనుకోటం ఎందుకు? అసలు తనకే సిగ్గు లేదు!